
# అనుకోని అదృష్టం

★ కుమారి టి. జి. శ్యామలాదేవి ★



'జానీ' అంటూ వెర్రికేక వేశాడు లోపల్నించి మోహన్. అప్పుడే బండిదిగి, వసారాలో అడుగు పెడుతున్న జానకి అలాగే నిలబడిపోయింది. ఆ పరిచిత కంఠాన్ని విని, స్థబ్దురాలైపోయింది. ఆ కంఠస్వరాన్ని యిక్కడ ఎలా వినగలిగిందో అర్థంకాలేదు ఆమెకు. ఇంతలోనే లోపల్నించి ఒక్క పరుగునవచ్చి, జానకి రెండు బుజాలు పట్టుకొని వూపుతూ "జానీ" అని సంతోషంగా పిలిచాడు మోహను. ఇప్పుడు జానకి మరీ అయోమయంలో పడిపోయింది. తనకళ్ళను తానే నమ్మలేక పోయింది. కలేమోనని భ్రమ పడింది. జానకి స్థితిచూసి మోహన్ గాభరాపడిపోయాడు. "జానీ, అలావున్న వేం" అంటూ ప్రశ్నించాడు. "చాలాచిక్కిపోయావు, వంట్లో బాగాలేదా?" అని అడిగాడు. "ఇక్కడి కెలావచ్చావు మోహన్" అనిమాత్రం అనగల్గింది. "జానీ! లోపల అమ్మ వుంది పద, తర్వాత అన్నీ మాట్లాడుకుందాం" అంటూ చెయ్యిపట్టుకొని లేవతీయబోయాడు మోహన్. కాని జానకి తన చేతినిమాత్రం ఎలాగో విడిపించుకోగలిగింది. "అమ్మా జానీ వచ్చింది" అంటూ కేకవేశాడు. సీతమ్మగారు లోపల్నించి ఒక్కపరుగున వచ్చింది జానకిదగ్గరకు. అత్తను చూచేసరికి, జానకి దుఃఖం ఆగలేదు. అత్తని కావలించుకొని ఏడ్చింది

జానకి పుట్టేంతవరకు ఆమె తలిదండ్రులు బాగా సిరి సంపదలతో తులతూగుచుండేవారు. జానకి భూమిమీద పడింది మొదలు క్రమంగా వారి సిరిసంపదలు హరించిపోసాగినవి. ఈకారణంగా జానకి తన అన్నదమ్ముల యొక్కగాని, తండ్రియొక్కగాని ప్రేమకు పాత్రురాలు కాలేక పోయింది. తల్లిమాత్రం కంటికి రెప్పలా జానకిని ఏలోటూ లేకుండా కాపాడేది. తన అన్నలూ, తండ్రీ ఎందుకు తన నింత తక్కువగా చూస్తున్నారో అర్థమయ్యేదికాదు జానకి లేతహృదయానికి. ఇంటిపనులు చేస్తే తనను వాళ్ళు ప్రేమగా చూస్తారేమోనని అనుకునేది.

జానకి అందచందాల్ని, వినయ విధేయతల్ని, ముద్దులొలికే నవ్వుని, తీయని కంఠాన్ని చూసి మోహన్ తల్లి సీతమ్మగారు చాలా మురిసిపోయేది. జానకికూడా ఆమెను అత్తాఅని పిలిచేది. ఒకసారి ప్రస్తావనలో తనకోడలుగా జానకినితప్ప యింకెవరిని చేసుకోనని సీతమ్మగారు జానకి తల్లితో చెప్పింది. తనకూతురి అదృష్టానికి జానకితల్లి చాలా మురిసిపోయింది. మొదటినుండీ కూడా యీ రెండు కుటుంబాలు బంధువులకంటె కూడా ఎక్కువగా కలిసి మెలసి వుండేవారు. సీతమ్మగారి పుట్టింటివారు దూరాన్న వున్నా జానకి తలిదండ్రులవలన ఆమెకాలోటు తీరిపోయేది. అందుకే తమస్నేహానికి, ప్రేమకి శాశ్వత చిహ్నంగా జానకినే తనకోడలుగా చేసుకుంటానని మాట యిచ్చింది సీతమ్మగారు. ఇందుకు మోహన్ తండ్రి, అన్నలూకూడా అడ్డు చెప్పలేదు.

ఇలా తల్లి, సీతమ్మగార్ల యొక్క ఆదరణలతో గారాబం

గానే పెరిగింది జానకి. జానకి, మోహన్‌ల స్నేహం కూడా దినాదినాభివృద్ధి చెందుతూనే వుంది. ఒకసారి జానకి మోహనులు గుళ్ళోకెళ్ళి దేవుని సాక్షిగా, అమాయక హృదయాలతో పెళ్ళి చేసుకొని వచ్చేశారు. ఇలా రెండేళ్ళ వరకు రెండు కుటుంబాల జీవితాలు ప్రశాంతంగా జరిగి పోయినాయి.

జానకి పన్నెండో యేట తల్లి ఆకస్మికంగా మరణించింది. తల్లి మరణమే జానకి కష్టాలకు నాంది. తల్లి చనిపోయిన నాటినుంచి జానకి జీవితంలో మార్పు వచ్చింది. ఇంటి బాధ్యత అంతా జానకిపైన పడింది. సీతమ్మగారు జానకిని అన్నివిధాల కాపాడుతూ వుండేది. బాధగా వున్నపుడల్లా అత్తవళ్ళో పడుకుని యేడ్చి, తనబాధనంతా పోగొట్టుకునేది జానకి. బాధగాకనుపిస్తే "జానీ నేవున్నాగా యింకా బాధ ఎందుకూ" అంటూ ఓదార్చేవాడు మోహన్. ఈ ఆసరాతో జానకి తనబాధను మర్చిపోతూవుండేది.

సీతమ్మగారు జానక్కి పెండ్లి చేయమని అడిగింది. పెద్దవాళ్ళకు కానిదే. దానికి యిప్పుడేమంత తొందరంటూ తోసేశాడు జానకి తండ్రి. ఉన్న కాస్త ఆస్తిని అమ్ముకొని, జానకి తండ్రి పిల్లతోసహా పట్నంనుంచి కాపరం ఎత్తేశాడు. కొన్నాళ్ళు బెజవాడలో కాపరం పెట్టాడు. ఇప్పుడు జానకికి మరీ బాధ లెక్కువయినాయి. కాని తన బాధను తనలోనే యిముడ్చుకొనేది. క్షేమ సమాచారములు మాత్రమే అత్తకు వ్రాస్తూవుండేది. సీతమ్మగారు జానకిని చూడాలని వుందని ఎన్నో వుత్తరాలు వ్రాసింది. జానకి తండ్రికి. కాని జవాబిచ్చేవాడు కాడు. ఒకసారి సీతమ్మగారే స్వయంగావచ్చి, బలవంతంగా జానకిని తీసికొని వెళ్ళింది పట్నం. పట్నం విడిచి వెళ్ళేనాటికే జానకి స్కూలు ఫైనలు పాసయినందువలన యీసారి వచ్చినపుడు వూరికే వుండలేదు. కష్టపడి చదివి యింటరు పరీక్షకి వెళ్ళింది. ఈసంగతి తెలిసి, తన కూతురు స్వతంత్రిస్తోందని అపోహపడి, పట్నంవెళ్ళి బలవంతంగా తీసుకు వచ్చాడు జానకిని తండ్రి. ఏదోవంక పెట్టి కూతుర్ని కొడుతూ తిడుతూవుండేవాడు. పట్నంకి ఉత్తరాలువ్రాయకూడదని ఆంక్ష పెట్టాడు.

బెజవాడలోకూడా జరగటం కష్టమయ్యేసరికి జానకి తండ్రి అక్కడినుంచి కాపరం పల్లెటూళ్ళో పెట్టాడు. పల్లెటూరి చాకిరి చెయ్యలేక జానకి చాలా అవస్తపడేది. తండ్రి ఇంట్లోలేనపుడు ఇరుగు పొరుగులవాళ్ళకి భారత, భాగవతాలు చదివి వినిపించేది. జానకిఅంత మంచిపిల్ల లేదనిపించుకున్నది ఆవూర్లో. ఇరుగు పొరుగువాళ్ళు కూడా జానకిని వోదారుస్తూ ఆమె పనుల్లోసహాయపడుతూ వుండేవారు. ఇటు తండ్రి బాధలూ, అటు మోహన్ ఎడబాటు సహించుకోలేకపోయింది. చచ్చిపోదామని ప్రయత్నించింది. కాని భగవంతుడు కూడా జానకిని స్వీకరించటానికి యిష్టపడలా.

తన బాధలను ఎవ్వరికీ తెలియనీయకుండా, ధైర్యంగా నవ్వుతూ జీవితాన్ని గడుపుకుంటూ వస్తున్నది జానకి. ఇంతలో తండ్రి తనకు పెళ్ళిప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుసుకుంది. మోహనుని తప్ప యింకెవర్నీ చేసుకోనని తండ్రితో చెప్పింది ఎలాగో ధైర్యంచేసి. "పుట్టి మాయిల్లు గుల్ల చేశావు. చాలదూ? యింక వాళ్ళనుకూడా నాశనం చెయ్యాలా?" అంటూ కోపంతో వెర్రికేకలేశాడు. జానకి హృదయం కలుక్కుమంది. తండ్రి అన్నమాట నిజమేననుకొన్నది. ఇంక యేమీ మాట్లాడలేకపోయింది. ఇలా జీవితం జరుగుతోంది జానక్కి. తిండికికూడా గతిలేకపోయింది వాళ్ళకు. దిగులుతో మంచమెక్కాడు. ఒకరోజు "నాన్నా" అనిపిలచింది జానకి. బాధలోవున్న తండ్రి ఆమెకేసి చూశాడు "నేను ఉద్యోగంచేస్తే ఏంనాన్నా" అని అడిగింది. జాలిగా, బాధగా చూశాడు కూతురివంక "ఆడపిల్ల నొమ్ముతిని, పాపం మూటకట్టుకోమన్నావా? నాకంఠంలో ఊపిరిఉండగా నీవు ఉద్యోగం చెయ్యడానికి వీల్లేదన్నాడు. ఏమీ మాట్లాడలేకపోయింది జానకి. తండ్రి జబ్బు విషమించిపోయింది. శక్తివంచన లేకుండా సేవచేసింది తండ్రికి జానకి. కాని మృత్యుదేవత జానకి సపర్యలనేమీ లెక్కచేయ్యలేదు. జానకి ప్రపంచంలో యేకాకి అయింది. ఈ ఆపదసమయంలో రామయ్య పంతులు కుటుంబమే జానకిని ఆదరించారు. ఆ దంపతులిద్దరూ జానకిని తమఇంట్లో పెట్టుకొని, తలిదండ్రులు లేని లోటును తీర్చారు. వారి ప్రేమాదరణలతో జానకి తన దుఃఖాన్ని మర్చిపోయింది. ఉద్యోగానికి ప్రయత్నించింది. రామయ్య పంతులు సహాయంవల్ల బొంబాయిలో ఆమెకి ఉద్యోగం దొరకింది.

బొంబాయి వెళ్ళేముందు పట్నంవెళ్ళి అత్తని, మోహ

నుని ఒకసారి చూచివద్దామనుకున్నది మనసులో. కాని వెళ్ళటానికి మనస్కరించలేదు. వాళ్ళని బాధపెట్టాల్సి వస్తుందేమోనని భయపడింది. బొంబాయి వెళ్ళిపోయింది. ఆప్తులెవరూ లేక పోయినప్పటికి, ఉద్యోగంవల్లా, స్నేహితులవలన శాంతిగానే జీవితాన్ని గడుపుతుంటోంది. ఇప్పుడు జానకిని వివాహమాడుటకు చాలామంది తయారయ్యారు. రామయ్యపంతులుకూడా పెండ్లి చేసుకుంటే బాగుంటుందని వ్రాశాడు జానకికి. స్వయంగా రెండు, మూడు సంబంధాలుకూడా వ్రాశాడు. కాని జానకి మాత్రం తాను బ్రహ్మచారిణిగా వుండదలచానని, పెళ్ళి చేసుకోనని'' జవాబు వ్రాసింది. రామయ్యపంతులు ఏమీ మాట్లాడలేదు యీ విషయంగురించి.

రామయ్యపంతులుయొక్క ఉదాసీనం చూసి జానకి చాలా భయపడ్డది. ప్రపంచంలో తనకున్న ఆ కాస్త ఆదరణ దూరమయిపోతుందేనని ఝుడిసిపోయింది. ఆయనకు కోపం వచ్చిందేమోనని తలచి, వెంటనే రెండునెలలు సెలవుపెట్టి, ఆయనను చూడాలని బొంబాయినుంచి వచ్చింది జానకి. బండిదిగి, లోపల అడుగు పెట్టగానే "జానీ" అనేకేక విన్నది. మోహను అక్కడ ఉంటాడని కలలోకూడా అనుకోలేదామె. వాకిట్లో అలాగే నిశ్చేష్టురాలై కూర్చుండిపోయింది. పెరట్లో ఏదో పనిచేసుకుంటున్న రామయ్యపంతులూ, భార్యా ఈ సందడిచూసి గబ గబా వాకిట్లోకి వచ్చారు. జానకినిచూసి ఆశ్చర్యపోయారు. రామయ్య దంపతులు ఎన్ని పిలచినా పలకలేక పోయింది. చివరకు సీతమ్మగారే నెమ్మదిగా జానకిని లేవదీసి, స్నానంచేయించింది. ఎలాగోఅలా అన్నం తిన్నాననిపించింది జానకి. ఆమెలో సందేహాలు, సమస్యలూ మెదలుతూనేవున్నాయి. రామయ్యపంతులు, ఆయన భార్యా, సీతమ్మగారు పనులు పూర్తి చేసుకోని వచ్చారు. సావిట్లో అందరూ తీరుబడిగా కూర్చున్నారు. రామయ్యపంతులు అడిగాడు సీతమ్మగారిని మీకు, జానకికి పరిచయమేమిటని.

"పరిచయమేమిటి అన్నయ్యా, జానకి మాయింట్లో అందరికి పంచ ప్రాణాలునూ. పట్నంలో జానకి తల్లీ తండ్రీ మాయింటి ప్రక్కనే కాపరం వుండేవారు. నీవు దూరంగావున్న లోటును తీర్చేవాడు జానకితండ్రి. నేనుకూడా ఆయనను అన్నయ్యా అని పిలిచేదాన్ని. జానకి పుట్టగానే మోహనుకి చేసుకోవాలని అనుకున్నాం. అలాగే వీళ్ళిద్దరూకూడా చిలకా గోరింకల్లా పెరుగుతూ వచ్చారు. అంత ప్రేమగావుండేవారు. కాని జానకి తండ్రి ఆర్థికపరిస్థితులు పాడయిపోవటంవలన బెజవాడకి మకాం మార్చేశాడు. జానకి అప్పటికి పెళ్ళియీడుకి వచ్చింది. పెళ్ళి చేయమని అడిగా వాళ్ళనాన్నని. పెద్దవాళ్ళు వాళ్ళ అన్నలకేకాలేదు, దానికిప్పుడు తొందరేమిటి అన్నాడు. వీళ్ళు బెజవాడ వచ్చినతరువాత ఒకసారి మాత్రమే జానకిని మాయింటికి తీసుకువచ్చాను. ఆతర్వాత వీళ్ళజాడే తెలియలేదు. నేనూ, మీ బావ ఎన్నో వుత్తరాలు వ్రాశాం. కాని ఒక్కదానికి జవాబులేదు. ఎక్కడున్నదీ తెలియలేదు. మోహను చాలబాధపడేవాడు. ఇంతలో మీ బావ మోహనుకి పెళ్ళిప్రయత్నాలు మొదలు పెట్టారు, ఇది తెలిసి మోహను బెజవాడవచ్చి గాలించాడు. జాడయేమీ తెలియలేదు. జానకినితప్ప యింకెవరిని చేసుకోనని పంతం పట్టాడు. కాని ఆయన వినలేదు. "దానికి అనుభవించే యోగ్యత లేదు, అందుకు నీవు పెళ్ళి మానుకోవటం తెలివితక్కువ" అని మందలించారు. పట్టుదలగా సంబంధాలు చూశారు. మోహను మరోలేకుండా తిరిగేవాడు. అన్నంతినేవాడుకాదు. ఆరోగ్యం పాడయిపోయింది. నేనుకూడా ఆయనతో చెప్పిచూశాను వాడికిష్టంలేని పెళ్ళిచేసి వాణ్ణి బాధపెట్టడం ఎందుకని పెళ్ళయితే అన్నీమరిచిపోతాడన్నారు. నచ్చచెప్పాల్సిందిపోయి, నీవుకూడా వాణ్ణి మద్దతు చేస్తున్నావా అని కోప్పడ్డారు. సరోజనిచ్చి బలవంతాన పెళ్ళిచేశారు. ఆతరువాత కొన్నాళ్ళకు మోహన్‌కు మతిపోయింది. వాణ్ణిచూసి ఇంట్లో అందరం ఏడ్చేవాళ్ళం. అమాయకురాలు సరోజినిని చూస్తే జాలివేసేది. ఒక్క నెల్లాళ్ళనుంచే వీడు మామూలుగా ఉంటున్నాడు. గాలిమార్పులకే ఇక్కడికి తీసుకువచ్చాను." అని సీతమ్మగారు ఎంతో బాధగా చెప్పింది.

"మంచిపని జరిగింది అత్తా. మోహన్‌కి పెళ్ళి చేసినం

దుకు చాలా సంతోషం. లేకపోతే మావాళ్ళు దరిద్రులై బాధపడినట్లే మీరూ కష్టపడాల్సి వచ్చేది" అంటూ కన్నీరు కార్చింది జానకి.

"అదేమిటి పిచ్చిదానా! నీవంటి రత్నం అందరికీ దొరుకుతుందా?" అన్నాడు రామయ్యపంతులు. మోహన్ జానకి కళ్ళల్లోకి జాలిగా చూశాడు. నేను దురదృష్టవంతుణ్ణి కదూ అన్నట్లు.

జానకి తన కష్టాలన్నీ మర్చిపోయి, రామయ్యపంతులింటిలో సంతోషంగా గడుపుతోంది. పట్టుపట్టి సరోజనిని కూడా ఆవూగు పిలిపించింది. మోహనుని ప్రవర్తన చూసి, భార్యను సరిగా చూచుట లేదని గ్రహించింది జానకి. సరోజను ప్రేమగా చూడమని అతన్ని చాటుగా మందలించేది.

ఇలా వుండగానే జానకికి పట్నంలో బదిలీ అయినట్లు ఉత్తరం వచ్చింది. పట్నంలో తమదగ్గరే వుండమని మోహన్, సరోజలు బ్రతిమాలారు. కాని జానకి ఒప్పుకోలేదు. శలవయిపోయిన తరువాత జానకి పట్నంలో వేరే ఇల్లు తీసుకొని వుంది. జానకి పట్నం వచ్చినతరువాత మోహనులో పూర్తిగా మార్పు వచ్చింది.

ముగ్గురికీ సుఖంలేకపోయింది. మోహన్ ఆశలు చిగురిస్తున్నాయి. సరోజకు ద్రోహం చెయ్యలేనని జానకి స్థిరపరుచుకొంది. జానకీ మోహనుల చిరప్రణయాను బంధాలను సరోజిని గ్రహించి అర్థం చేసుసుంది.

ఇప్పుడేంకావాలి? విడని సమస్యగా పరిణమించింది. చివరకు సరోజిని త్యాగం జానకీ మోహనులకు అనుకోని అదృష్టం అయింది. ★


ప్రెసిడెంట్

వెజిటబుల్ తలనూనె,

స్నో, టాల్కం పౌడరు



ఎంతో ఆహ్లాదకరమైనవిగాను గుణకరమైనవిగాను ఉన్నవి

అని వైజయంతీమాల చెప్పుచున్నది-

మాన్యుఫేక్చరర్స్:

రథోడ్ ట్రేడింగ్ కంపెనీ, :: మద్రాసు - 1